సాక్షి నిజామాబాద్

శనివారం ၊ 14 ၊ జూన్ ၊ 2025



నాణ్యమైన విద్య..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు.

- 8లో ▸



అంతర్జాతీయ స్థాయిలో..

ఫతేనగర్ ఫస్ట్ ప్లాట్ గ్రామానికి చెందిన ఇమ్రాన్ అలీఖాన్ ఉమ (మార్షల్ ఆర్ట్స్) క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /22.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రిలో రోగి భర్త ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మహమ్మద్ నగర్‌కు చెందిన సాయిలు (38) గురువారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయిలు భార్య సంగీతను అనారోగ్యం కారణంగా ఈ నెల 6న ఆస్పత్రిలో చేర్పించారు. సంగీత రక్త హీనతతో బాధపడుతోంది. భార్యకు అనారోగ్యం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన సాయిలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కక్షిదారు వద్దకు న్యాయమూర్తి



ఆర్మూర్‌టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఆర్మూర్ కోర్టులో శుక్రవారం కొట్లాట కేసులో ఇరువురు రాజీపడ్డారు. అయితే నడవలేని స్థితిలో ఉన్న కక్షిదారు దగ్గరకే న్యాయమూర్తి సరళ రాణి వచ్చారు. ఈ కేసులో రాజీ కుదిర్చారని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

- జిల్లా వ్యాప్తంగా 18 బెంచ్‌ల ఏర్పాటు




నిజామాబాద్ లీగల్ : కేసుల సత్వర పరిష్కారంలో భాగంగా జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో మొత్తం 18 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ కోర్టులో 11, బోధన్‌లో 4, ఆర్మూర్‌లో 3 బెంచ్‌లు కేసుల పరిష్కారం కోసం కృషిచేస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయభాస్కర్ రావు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, బ్యాంకు, మునిసిపల్, మోటారు బీమా, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించనున్నట్టు తెలిపారు. కక్షిదారులు కేసుల సత్వర పరిష్కారం కోసం రాజీ మార్గమే రాజమార్గం అన్న ధోరణితో లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2026 సివిల్ సర్వీస్ పరీక్షకు సన్నద్ధమయ్యే వారికి ఉచితంగా లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి జూలై 8వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఉచిత కోచింగ్ హైదరాబాద్‌లోని లక్ష్మీనగర్‌లో ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న వారిలో వందమంది ప్రతిభావంతులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08462 241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు ప్రణవానంద దాస్ స్వామీజీ రాక



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగే పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ప్రతినిధి ప్రణవానంద దాస్ రానున్నారని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భూమేశ్ గుప్తా తెలిపారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వామీజీ రాక సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని హౌసింగ్ బోర్డు శారదామాత ఆలయం నుంచి ధర్మశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కన్యకా పరమేశ్వరి ఆలయంలో స్వామివారి ప్రవచన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఇస్కాన్ కామారెడ్డి ఇన్‌చార్జి వెంకటదాస్, కన్వీనర్ సిద్దిరాములు, ప్రతినిధులు శ్రీహరి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో చిగురిస్తున్న ఆశలు!

గతంలో ధరణిలో సాంకేతిక కారణాల వల్ల పెండింగ్ పడిపోయిన భూ సమస్యలు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతితో పరిష్కారమవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భూభారతి గ్రామసభల్లో అధికారులు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. గ్రామ సభలు ఈ నెల 20 వరకు కొనసాగనున్నాయి. ఈ సభలు పూర్తయిన తర్వాత అధికారులు క్షేత్ర పరిశీలన చేసి భూ సమస్యలు పరిష్కరిస్తారు.

దోన్‌పాల్‌లో నిర్వహిస్తున్న భూభారతి గ్రామ సభ, వినతి పత్రాలను అందిస్తున్న రైతులు (ఫైల్)



- ధరణిలో సాంకేతిక కారణాలతో పేరుకుపోయిన సమస్యలు
- భూభారతి ద్వారా పరిష్కారం కావొచ్చనే ధీమాలో భూ యజమానులు
- ఈనెల 20 వరకు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం భూ సమస్యల పరిష్కారానికి అవకాశం

మోర్తాడ్(బాల్కొండ): ఎన్నో ఏళ్లగా పేరుకుపోయిన భూముల సమస్యలు భూభారతి గ్రామ సభలలో స్వీకరిస్తున్న దరఖాస్తులతో పరిష్కారం దొరుకుతుందని దరఖాస్తుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన ధరణి వల్ల ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించలేదని, భూభారతి వల్ల తమకు పట్టాలు లభిస్తాయనే నమ్మకంతో వినతి పత్రాలు ఇస్తున్నారు. మోర్తాడ్, భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మెండోరా, ముప్కాల్, బాల్కొండ, ఏర్గట్ల తదితర మండలాల్లో భూభారతి గ్రామసభల నిర్వహణ సాగుతోంది.

ఈనెల 20 వరకు గ్రామసభలు సాగనున్నాయి. గ్రామసభలు ముగిసిపోయిన తర్వాతనే తమకు అందిన దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలన చేయనున్నారు. అనంతరం భూముల సమస్యలకు ఒక పరిష్కారం లభించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉండగా ధరణి అమలులో ఉన్న సమయంలో తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఆర్‌డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు పంపించేవారు. ఈసారి కూడా మండల స్థాయిలో ఆప్షన్ ఇవ్వకపోవడంతో గతంలో మాదిరిగానే ఆర్‌డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు పంపించాల్సి ఉంటుంది. రెవెన్యూ ఉద్యోగుల తప్పిదాల వల్ల పట్టా పాసుపుస్తకాలు అందుకోలేని వాళ్లు మండల స్థాయిలోనే కొత్త పట్టా బుక్కులు తీసుకునేలా సవరణ చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తుంది. ఆప్షన్‌లలో మార్పు లేకపోయినా గతంలో కంటే వేగంగానే ఫైళ్లు కదలడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో 50 నుంచి 80 వరకూ భూ సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు అధికారులకు అందుతున్నాయి. భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో అమలు చేసిన నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారం త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



సుంకెట్ గ్రామసభలో అధికారులకు వినతి పత్రాలను అందిస్తున్న భూముల యజమానులు

మెరుగైన సేవలు అందనున్నాయి..



భూభారతి వల్ల రైతులకు మెరుగైన సేవలు అందనున్నాయి. గతంలో ధరణిలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడం, సరైన ఆప్షన్‌లు ఇవ్వకపోవడంతో భూ ముల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాలేదు. భూభారతి గ్రామ సభల నిర్వహణ పరిశీలిస్తే సమస్యలు వేగంగానే పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

– గడ్డం లింగారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్

రైతులు రుణపడి ఉంటారు..



భూభారతిలో గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించే వీలు ఉంది. దీంతో రైతులకు సమస్యలు తీరనున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం కావడంతో రైతులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. అధికారులు జాప్యం చేయకుండా వేగంగా సమస్యలను పరిష్కరించాలి.

– రొక్కం మురళి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్, తిమ్మాపూర్

వేగంగానే సమస్యల పరిష్కారం..

భూభారతి పోర్టల్ వల్ల వేగంగానే సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. వినతులను స్వీకరించిన వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఈనెల 20 తరువాత క్షేత్ర స్థాయిలో పర్యటించి భూముల సమస్యలకు అడ్డంకులు ఏమి ఉన్నాయో తెలుసుకోనున్నాం. ఆ తరువాత దరఖాస్తుదారులకు పరిష్కార మార్గం చూపుతాం.

– కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్

- వినయ్ కృష్ణారెడ్డికి స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కలెక్టర్‌గా టి వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.45 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల స ముదాయం వద్దకు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. నేరు గా తన చాంబర్‌కు చేరుకున్న కృష్ణారెడ్డి అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులతో భేటీ అయ్యి జిల్లా స్థితిగతులు, స్థా నిక పరిస్థితుల గురించి చర్చించారు. కొత్త కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు కలిసి పరిచయం చేసుకున్నారు. అదనపు కలెక్టర్లతో పాటు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యో గ సంఘాల నాయకులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.





కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

ఫ్రస్టేషన్‌లో కేసీఆర్ ఫ్యామిలీ

- కాళేశ్వరం అక్రమాలపై విచారణను భరించలేకపోతున్నారు
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఆయనను బయట తిరగనివ్వం
- మంత్రి పదవి కేటాయింపులో జిల్లాకు అన్యాయం జరిగింది
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ సిటీ: కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై కేసీఆర్, హరీశ్‌రావును విచారిస్తుంటే భరించలేక సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారని, ఇప్పుడు విచారిస్తుంటే కేసీఆర్ ఫ్యామిలీ ఫ్రస్టేట్ అవుతోందన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రేవంత్‌పై అభ్యంతకరవ్యాఖ్యలు చేస్తున్న కేటీఆర్‌ను బయటతిరనివ్వమన్నారు. కేసీఆర్ కుటుంబంలో ఇంటిపోరు నడుస్తోందని, ఒకవైపు బిడ్డ, మరోవైపు కొడుకు ఆధిపత్యం కోసం కొట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ బిడ్డ లిక్కర్ కేసులో, కొడుకు ఫార్ములా వన్ కేసులో, హరీశ్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరుకున్నారని, వారిని బీజేపీ కాపాడుతోందని ఆరోపించారు. కేటీఆర్ తన వ్యాఖ్యలను మానుకోకుంటే భౌతిక దాడులకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు అన్యాయం జరిగిందని, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. మలివిడత విస్తరణలో జిల్లాకు అవకాశం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, వేణురాజ్, సంతోష్, బోర్గాం శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, జువ్వాజి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ ఖుర్దులో నిరక్షరాస్య మహిళలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తోటి సంఘం సభ్యులు



అమ్మకు అక్షరాభ్యాసం

కామారెడ్డి టౌన్ : వంద శాతం మహిళలను అక్షరాస్యులుగా చేయాలన్న లక్ష్యంతో కామారెడ్డి జిల్లాలో విద్యాశాఖ 'అమ్మకు అక్షరాభ్యాసం' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలో నిరక్షరాస్యులై న మహిళలను అక్షరాస్యులుగా చేయనున్నారు.

జిల్లాలోని 25 మండలాల్లో 17,194 స్వయం సహాయక సంఘాలున్నాయి. వాటిలో 42,749 మంది సభ్యులు నిరక్షరాస్యులని గు ర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని శుక్రవారం గాంధారి మండలం పోతంగల్ ఖుర్దులో డీఈవో రాజు ప్రారంభించారు. వేదపండితుడితో అక్షరాభ్యాసం పూజ చే యించి పలకా బలపం పట్టించి అక్షరాలు దిద్దించారు.

తోటి సభ్యులతో చదువుచెప్పించే ప్రణాళిక..

న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్‌కు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్యలో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు అదే గ్రూపులోని అక్షరాస్యులైన మహిళలతో చదువు చెప్పించనున్నారు. వయోజన విద్యా విభాగం ప్రత్యేక కార్యక్రమాలతో వారు అక్షరాలు చదివేలా, చిన్నపాటి లెక్కలు చేసేలా, ఇంగ్లిష్ చదివేలా చేయాలన్నది ఈ కార్యక్రమ ఉద్దేశం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి బడిబాటలో భాగంగా నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసాలతో పాటు వయోజన విద్య విభాగానికి సంబంధించిన 'అమ్మకు అక్షరాభ్యాసం' కార్యక్రమాలను సైతం ఘనంగా నిర్వహిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

వందశాతం అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు కృషి

వంద శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా మార్చేందుకు 'అ మ్మకు అక్షరాభ్యాసం' కార్యక్రమం ప్రారంభించాం. జిల్లావ్యాప్తంగా స్వయం సహాయ క సంఘాలలో వయసుతో సంబంధం లే కుండా నిరక్షరాస్యులైన వారిని గుర్తించాం. వారందరికీ ఈ కార్యక్రమంలో చదు వు నే ర్పుతాం.

– రాజు, డీఈవో, కామారెడ్డి

ఫార్మర్ రిజిస్ట్రీలో నందిపేట ముందంజ

- జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో రెండో స్థానం

నందిపేట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంలో భాగంగా రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ ఈ రిజిస్ట్రీలో రైతుకు ఉన్న భూముల వివరాలను నమోదు చేసే ప్రక్రియను జూన్ 5 నుంచి వ్యవసాయ శాఖ అధికారులు ప్రారంభించారు. కాగా ఈ యాప్‌లో నమోదు ప్రక్రియలో భాగంగా నందిపేట మండలం ముందంజలో ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వారీగా వివరాలను అత్యధికంగా నమోదు చేయడంతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. అంతేగాకుండా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉంది.

రైతుల వివరాలు నమోదు

నందిపేట మండలంలో మొత్తం రైతులు 11,282 మంది ఉండగా ఇప్పటి వరకు 7008 మంది రైతుల వివరాలను 62.12 శాతం ఏఈవోలు యాప్‌లో నమోదు చేశారు. క్లస్టర్ల పరిధిలోని గ్రామాల వారీగా ఏఈవోలు ప్రతి రోజు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ రైతుల వివరాలను సేకరిస్తున్నారు. రైతు ఆధార్‌కార్డు, పట్టదారు పాసుపుస్తకంలోని భూముల వివరాలు, యాప్‌లో నమోదు చేయగానే 11 నంబర్ల ప్రత్యేక యూనిక్ కోడ్ కెటాయిస్తున్నారు. అయితే యాప్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలతో రైతుల వివరాలను నమోదు చేసేందుకు ఏఈవోలు పడరాని పాట్లు పడుతున్నారు. రైతులకు చెందిన భూముల సమాచారం యాప్‌లో కనిపించకపోవడంతో వివరాలను నమోదు చేసే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. అదేవిధంగా రైతుల సెల్‌ఫోన్లలో ఓటీపీ నంబరు రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్ నంబరును రైతులు వాడకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని ఏఈవోలు పేర్కొంటున్నారు. నిర్ణీత గడువుకు ముందే నమోదు చేసేందుకు ఏఈవోలు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. అయితే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, మట్టి నమూనాల సేకరణతో పాటు రైతు ముంగిట్లో వ్యవసాయం కార్యక్రమాలలో కొంత జాప్యం ఏర్పడుతుంది.



నందిపేట మండలం కుద్వాన్‌పూర్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు

నందిపేట మండలంలో ఫార్మర్ రిజిస్ట్రీ యాప్ వివరాలు

క్లస్టర్	మొత్తం రైతులు	నమోదైన రైతులు
నందిపేట	3360	2798
ఉమ్మెడ	2515	1361
చింరాజ్‌పల్లి	2722	1507
కుద్వాన్‌పూర్	2685	1342

అన్ని గ్రామాల్లో వివరాలు నమోదు

ఏఈవోలు అన్ని గ్రామాలలో రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. గడువుకు ముందే రైతులందరి వివరాలను నమో దు చేయాలనే లక్ష్యంతో ఏఈవోలు పనిచేస్తున్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో వివరాల నమోదులో జాప్యం ఏర్పడుతోంది.

– జోత్స్న భవాని, మండల వ్యవసాయాధికారిణి, నందిపేట

ఫోన్ చేస్తే బస్సు వేళలు.. చార్జీల వివరాలు

ఫోన్‌నంబర్లు..

ఆర్మూర్	73828 43133
బోధన్	98495 00725
నిజామాబాద్	99592 26022
బాన్సువాడ	94911 05706
కామారెడ్డి	73828 43747

ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్సు ప్రయాణికుల కోసం సంస్థ మరో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి ఆయా ప్రాంతాలకు బస్సులు బయలుదేరు సమయం వివరాల తెలుసుకునేందుకు బస్టాండ్‌లకు వెళ్లే అవసరం లేకుండా ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ నంబర్లకు ఫోన్ చేసి బస్సుల వేళలు, చార్జీల వివరాలు తెలుసుకోవచ్చు. సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని సురక్షిత ప్రయాణం చేయాలని ఆర్‌ఎం జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.



క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్: జిల్లా ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, 2024 – 25 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషనల్ కంప్యూటర్స్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళా పద్మనగర్‌లోని వేంకటేశ్వర కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 80740 65803 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

17 వరకు వెబ్ ఆప్షన్‌కు అవకాశం

నిజామాబాద్ అర్బన్: డైట్ కళాశాలలో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నవారు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని నిజామాబాద్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన కళాశాలల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీటు పొందిన వారు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు అలాట్‌మెంట్ లెటర్ తీసుకొని సంబంధిత కళాశాలలో జాయిన్ కావాలని సూచించారు.

33, 11 కేవీ ఫీడర్లపై ఎఫ్‌పీఐల ఏర్పాటు

సుభాష్‌నగర్: నగరంలో 33 కేవీ, 11 కేవీ లైన్లలో లోపాన్ని గుర్తించేందుకు ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ల(ఎఫ్‌పీఐ) ఏర్పాటు చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఆర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రేక్ డౌన్ సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, టెక్నికల్ సమస్యలతో లైన్ మొత్తం చెక్ చేయకుండా లోపం ఉన్న కచ్చితమైన స్పాట్‌ను ఎఫ్‌పీఐ తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఫలితంగా విద్యుత్ సరఫరా తేలికగా పునరుద్ధరించవచ్చన్నారు. జిల్లాలోని 50 విద్యుత్ ఫీడర్లలో ఎఫ్‌పీఐలను బిగించడానికి అవసరమైన ప్రదేశాలను గుర్తించామని తెలిపారు.

వాహనాల తనిఖీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌గేట్ వద్ద శుక్రవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించడంతోపాటు పెండింగ్ చలాన్లను కట్టించారు. నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించినా ఆటోనే కడుపునింపుతోంది

- ఉషు క్రీడలో ఇమ్రాన్ అలీఖాన్ ప్రతిభ
- చిన్నారులకు ఉచిత శిక్షణ
- గోల్డ్‌మెడల్ సాధించినా మారని పరిస్థితులు


ఆటో నడుపుతున్న ఇమ్రాన్ అలీఖాన్



అంతర్జాతీయ వేదికపై గోల్డ్‌మెడల్ అందుకుంటున్న మహ్మద్ ఇమ్రాన్ అలీ (ఫైల్)

నవీపేట: మండలంలోని ఫతేనగర్ ఫస్ట్ ప్లాట్ గ్రామానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ అలీఖాన్ ఉషు(మార్షల్ ఆర్ట్స్‌లో కత్తితో విన్యాసం)లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడు. సర్వర్ అలీఖాన్, నసీమ్ సుల్తానాకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. క్రీడాకారుడైన సర్వర్‌ఖాన్ తన కుమారుల్లో ఒక్కరినైనా ఉత్తమ క్రీడాకారుడిగా తీర్చిదిద్దాలని కలలుగన్నాడు. కుమారుల్లో ఒకరైనా మహమ్మద్ ఇమ్రాన్ అలీఖాన్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో ఉన్న ఉత్సాహాన్ని పసిగట్టి ఉషు వైపు పరుగులు పెట్టించాడు. అప్పు చేసి పంజాబ్‌లోని పాటియాల ఎన్‌ఐఎస్‌లో బీపీఈడీ(బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్)లో చేర్పించాడు. అక్కడి నుంచి డిప్లొమా సాధించిన ఇమ్రాన్ అలీఖాన్ ఉషు క్రీడపై మరింత దృష్టి సారించి, మెళకువలు నేర్చుకున్నాడు.

అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్

రష్యా రాజధాని మాస్కోలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు 10వ ఇంటర్నేషనల్ ఉషు స్టార్స్ టోర్నమెంట్(2025)ను నిర్వహించారు. ఈ వేదికలో 17 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. మన దేశం నుంచి 58 మంది క్రీడాకారులు పాల్గొనగా తెలంగాణ నుంచి ఇద్దరు పాల్గొన్నారు. ఆ ఇద్దరిలో ఒకరైన మహ్మద్ ఇమ్రాన్ అలీఖాన్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించాడు.

ఆటో ఇంటి వద్ద ఉంటే పస్తులే!

అంతర్జాతీయ స్థాయి ఉషులో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన మహమ్మద్ అలీఖాన్ జీవనోపాధి కోసం ఆటో నడుపుతున్నాడు. భార్య, నాలుగేళ్ల కుమారుడిని పోషించేందుకు ప్రతిరోజూ ఆటో నడపాల్సిందే. ఏ ఒక్కరోజూ ఆటో ఇంటి వద్ద ఉన్నా ఆ కుటుంబం పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా టోర్నీమెంట్‌లకు వెళ్లేందుకు మళ్లీ అప్పులు చేస్తున్నాడు. ఆయన ఉత్సాహాన్ని చూసి కుటుంబ సభ్యులు సైతం అడ్డుకోలేకపోతున్నారు. ఓ వైపు టోర్నమెంట్‌లలో పాల్గొంటూ.. మరో వైపు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న ఇమ్రాన్ అలీఖాన్ నిజామాబాద్‌లో ప్రతి రోజూ కొంత మంది పేద చిన్నారులకు ఉచితంగా ఉషు శిక్షణ ఇస్తున్నాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తా. నన్ను ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నా. జీవనోపాధి కోసం ఆటో తోలుకునే నాకు స్పోర్ట్స్ కోటాలో ఎక్కడైనా ఉద్యోగం కల్పించాలని కోరుతున్నా. మార్షల్ ఆర్ట్స్ విభాగంలోని ఉషులో రాణించేందుకు ప్రోత్సహించాలి.

– మహ్మద్ ఇమ్రాన్ అలీఖాన్, ఉషు ఇంటర్నేషనల్ క్రీడాకారుడు

రాష్ట్రంలోనే ఏకైక పట్టు చేనేత సహకారం సంఘం

మీకు తెలుసా?



తెలంగాణ ఉన్న ఏకైక పట్టు చేనేత సహకార సంఘం ఆర్మూర్ పట్టణంలో కొనసాగుతోంది. గోల్‌బంగ్లా వద్ద ఉన్న పట్టు చేనేత సహకార సంఘాన్ని 1951 ఏప్రిల్ 3వ తేదీన ఆపోక్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పండిత్ శివలింగు స్థాపించారు. ఈ ప్రాంతంలో ఉన్న పట్కారి (ఖత్రి) పట్టు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు చేనేత కార్మికులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. పట్టుచీరలు, పట్టు ధోవతులు, కండువాలు, తలపాగాలు, షర్టింగ్ పట్టు వస్త్రాలను మగ్గాలపై నేసి విక్రయించేందుకు దీన్ని నెలకొల్పారు. ఆర్మూర్ పట్టు చేనేత సహకార సంఘం స్థాపించనప్పుడు 98 మంది చేనేత కార్మికులు ఉండేవారు. 1990లో కార్మికుల సంఖ్య 576 మందికి పెరిగింది. ప్రస్తుతం సుమారు 468 మంది సభ్యులున్నారు. పట్టును బెంగళూరు నుంచి తీసుకొస్తారు. గతంలో కోల్‌కతా, కశ్మీర్ నుంచి తీసుకొచ్చేవారు. పట్టు వస్త్రాలు నేసే ముడి సరుకు (అడ్డదారం, నిలువు దారం) ధరలు ప్రస్తుతం పెరగడంతో ఉత్పత్తి చేసిన పట్టువస్త్రాల అమ్మకాల్లో లాభాలు రాకపోవడంతో ఆర్థిక భారంతో నేత పనికి క్రమంగా స్వస్తి పలుకుతున్నారు. ఇక్కడ నేసిన పట్టు వస్త్రాలకు మన రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ పెద్దగా ఆదరణ లేదు. పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని నాందెడ్, బస్మత్, నాయ్‌గావ్, పర్బనీలో పట్టు వస్త్రాలను విక్రయిస్తారు.

– ఆర్మూర్

సమాచారం

అత్యవసర పరిస్థితులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు..

డయల్	100
స్పెషల్ బ్రాంచ్	87126 59777
పోలీస్ కంట్రోల్ రూం	08462 226090

– ఖలీల్‌వాడి

నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్

నిజామాబాద్ అర్బన్: బడులు ప్రారంభమై రెండు రోజులు గడవకముందే అక్రమ డిప్యుటేషన్‌లకు తెరలేపారు. ఓ ప్రధానోపాధ్యాయురాలు జారీ చేసిన డిప్యుటేషన్ ఉత్తర్వులు చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ జూలై 15వరకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు విరుద్ధంగా ధర్పల్లి మండలం దుబ్బాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు తన పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న స్వప్న అనే తెలుగు ఉపాధ్యాయురాలిని సర్దుబాటు పేరుతో ధనంబండ తండాకు పంపించడం చర్చనీయాంశమైంది. గత విద్యా సంవత్సరంలోనూ కాంప్లెక్స్ హెచ్‌ఎంపై అనేక ఆరోపణలు వచ్చాయి. పిల్లలకు ఉచిత దుస్తులు పంపిణీ చేయకపోవడం, కాంప్లెక్స్ గ్రాంట్‌కు సంబంధించి సీనియర్ ఉపాధ్యాయులను కాదని తనకు అనుకూలమైన ఉపాధ్యాయులకు జాయింట్ బ్యాంకు ఖాతా తీసి ఇచ్చారని, నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలున్నాయి.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

బోధన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. బడిఈడు పిల్లలను కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

11 ఏళ్లుగా మూతపడి ఉన్న బోధన్ మండలంలోని భవానీపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గ్రామ యువత, ప్రజల సహకారంతో మండల విద్యాశాఖ అధికారులు తెరిపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన విద్యార్థుల సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.


విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో అశోక్, ఎంఈవో నాగయ్య

పాఠశాల ఆవరణలో తరగతి గదులు, మరుగుదొడ్డి నిర్మింపజేసిన రుద్ర ఫౌండేషన్ ప్రతినిధులను, పాఠశాల పునరుద్ధరణకు సహకరించిన గ్రామ యువకులను డీఈవో అభినందించారు. ఎంపీడీవో బాలగంగాధర్ తిలక్, టీచర్ కార్తీక్, సీఆర్‌పీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలి
- కో ఆర్డినేషన్ సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలోని వార్డులు, గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడా వర్షం, మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన పనులు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల డివిజన్, మండల అధికారులు, ఉద్యోగులతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వారితో మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మలేరియా, డెంగీ ప్రబలే హాట్ స్పాట్ పాయింట్‌లను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, డెంగీ వ్యాధుల నిర్ధారణ కిట్లు, పాముకాటు, ఇతర సీజనల్ వ్యాధులను నియంత్రించే మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యరక్షణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సమత, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, డీఎల్‌పీవో నాగరాజు, ఎంఈవో నాగయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ


కలెక్టర్‌తో రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు

జిల్లా నూతన కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయనను జిల్లా ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, బొకేలు అందజేశారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, భాస్కర్, రెవెన్యూ అధికారులు విజయకాంత్‌రావు తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిశారు.

– నిజామాబాద్ అర్బన్

క్రైం కార్నర్

గుర్తింపు లేని పాఠశాల సీజ్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా కొనసాగుతున్న హ్యాపీ కిడ్స్ పాఠశాలను ఎంఈవో రాజగంగారాం శుక్రవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రకటనలను చేసి మోసపోవద్దని, నాణ్యమైన విద్యనందించే పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు.

రెండు గూడ్స్ వాహనాలు..



ఆర్మూర్‌టౌన్: ఫిట్‌నెస్, పర్మిట్ లేని రెండు గూడ్స్ వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ వివేకానందరెడ్డి తెలిపారు. ఆర్మూర్‌తోపాటు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల బస్సులను, గూడ్స్ వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు సరైన సమయంలో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, టాక్స్ చెల్లించాలని, లేనిపక్షంలో సీజ్ చేయడం జరుగుతుందన్నారు. సీజ్ చేసిన రెండు గూడ్స్ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీలో ఆర్టీఏ సిబ్బంది మనోజ్, దశరథ్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్యకు అనుమతి లేదు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన భవనంలో శ్రీ చైతన్య పాఠశాల అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతోందని, ఆ పాఠశాలకు ఎలాంటి అనుమతి లేదని నిజామాబాద్ రూరల్ మండల విద్యాశాఖ అధికారి సేవల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలో తమ పిల్లలకు అడ్మిషన్లు తీసుకోవద్దని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్: హత్యాయత్నం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి పి సాయిసుధ తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌కు చెందిన రేణుకకు పోచమ్మగల్లీకి చెందిన మద్దికుంట వెంకటితో వివాహమైంది. గొడవ కారణంగా రేణుక తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. అదే ఇంట్లో రేణుక అక్కయ్య అనుపమ సైతం ఉంటోంది. మరో వైపు రెండో పెళ్ళిచేసుకున్న వెంకటి తన పిల్లలను చూసేందుకు 2017 జనవరి 17న అత్తవారింటికి వచ్చాడు. వెంకటితో మాట్లాడేందుకు పిల్లలు నిరాకరించడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన అతడు అత్త లక్ష్మి, వదిన అనుపమపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితులు మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన సీనియర్ సివిల్ జడ్జి ఐపీసీ 307 సెక్షన్ ప్రకారం నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూటర్‌గా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పి లక్ష్మీనర్సయ్య వ్యవహరించారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టపల్లికి చెందిన సిర్నాపల్లి గంగాధర్(40) కువైట్‌లో సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరగా, తల్లిదండ్రులు లక్ష్మి, చిన్న గంగారాంతోపాటు భార్య సుజాత, కూతుళ్లు, కొడుకు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. కుటుంబీకులు, బంధుమిత్రులు, గ్రామస్తులు గంగాధర్ అంత్యక్రియలను పూర్తి చేశారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న

ఖలీల్‌వాడి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ నగరంలోని జకీర్‌ఫామ్ హౌజ్‌లో తనిఖీ చేయగా షేక్ షకీల్ అనే వ్యక్తి వద్ద 134 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. అతడిని విచారించగా మధుకర్ వద్ద తాను గంజాయి కొనుగోలు చేశానని చెప్పాడు. వెంటనే మధుకర్ ఇంటి వద్ద తనిఖీలు చేసి 50 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. షకీల్, దాతే మధుకర్‌తోపాటు దాగే దాతూరాం ముగ్గురు గంజాయి విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గుర్తించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి పట్టుబడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. గంజాయితోపాటు ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారికి సంబంధించిన సమాచారాన్ని 87126 58970 నంబర్‌కు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ అన్నారు. ఎక్సైజ్ ఎస్సై రాము, హెడ్‌కానిస్టేబుల్ చిట్టి నారాయణరెడ్డి, హమీద్, శివ, ప్రీతమ్, అవినాష్, భోజన్న, విష్ణు, రాజన్న పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురు..

మోర్తాడ్(బాల్కొండ): మండల కేంద్రంలో రొయ్యల సురేశ్ అనే వ్యక్తిపై రెండు రోజుల క్రితం దాడికి పాల్పడిన ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రొయ్యల సురేశ్ కారులో వెళ్తుండగా రొడ్డుకు అడ్డంగా బైక్ నిలిపిన మహ్మద్ షాహబాజ్, అబ్దుల్ మజార్‌ను బైక్ తీయాలని అనడంతో వారు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. సురేశ్‌పై బైక్‌ను పడేసి తలపై రాడ్‌తో కొట్టారని, వారికి మహ్మద్ అస్లాం, అబ్దుల్ మాలిక్, అబ్దుల్ అర్బాజ్, మహ్మద్ ఫయాజ్‌లు మద్దతు తెలుపుతూ దాడికి ఉసిగొలుపుతూ బూతులు తిట్టారని తెలిపారు. తన భర్తపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సురేశ్ భార్య సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


మల్లేశ్ మృతదేహం

ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు మురికికాలువలో పడి నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన సిద్దులోల్ల మల్లేశ్(76) అనే వ్యక్తి మృతి చెందినట్లు నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో కూరగాయల షాపు నడిపే మల్లేశ్ గురువారం రాత్రి 7.30 గంటలకు సీతారాంనగర్ కాలనీలోని ఇంటి వచ్చాడు. ఆ తరువాత వైన్స్‌షాపునకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. శుక్రవారం ఉదయం గాయత్రినగర్‌లోని పద్మశాలి సంఘం వద్ద మురికికాలువలో ప్రమాదవశాత్తు పడి చనిపోయాడు. మృతుడి కుమారుడు ఆనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..


మోతీలాల్ మృతదేహం

బాన్సువాడ రూరల్: నిజాంసాగర్ మండలం కొనతండాకు చెందిన దేవసోత్ మోతీలాల్ (48) అనే వ్యక్తి గురువారం రాత్రి తిర్మలాపూర్ శివారులో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాన్సువాడ మండలంలోని బుడిమి గ్రామంలో తాను పనిచేసే రైస్‌మిల్లుకు వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. మోతీలాల్ ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మృతుడి భార్య దేవసోత్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన్ తెలిపారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు.

పాముకాటుతో..


కిష్టయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని వాడి గ్రామానికి చెందిన బాల్‌లింగం కిష్టయ్య(67) అనే వ్యక్తి పాముకాటుతో మృతి చెందాడు. కిష్టయ్య గురువారంరాత్రి భోజనంచేసి తన ఇంట్లో నిద్రించాడు. శుక్రవారం వేకువజామున నాలుగు గంటలప్రాంతంలో తనను పాము కరిచిందని భార్య సిద్ధవ్వకు తెలిపాడు. వెంటనే ఆమె కుమారులతో కలిసి కిష్టయ్యను మెదక్ ఆస్పత్రికి తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో కిష్టయ్య మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది సుశ్మన్ రెడ్డి



నిజామాబాద్ లీగల్: తెలంగాణ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నిజామాబాద్‌కు చెందిన న్యాయవాది సుశ్మన్ రెడ్డి నియమితులయ్యారు. సుశ్మన్ రెడ్డి నియామకం పట్ల నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల సాయిరెడ్డి, మాణిక్‌రాజ్, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుశ్మన్ రెడ్డిని నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు అజార్ కిషన్ రావు, నారాయణదాస్, జగన్ గౌడ్, న్యాయవాదులు శ్యామ్ బాబు, శ్రీనివాస్ గౌడ్, సురేష్, ఇంతియాజ్, ప్రకాష్ గౌడ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

- ఆయిల్, కాపర్ వైరు చోరీ
- రూ.10 లక్షల ఆస్తినష్టం



రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి ఎత్తిపోతల పథకం మొదటి స్టేజీ గోదావరి నది ఒడ్డున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేసి ఆయిల్, కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. 2016లో ఇదే తరహా చోరీ జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి చోరీ చేసినట్లు శుక్రవారం గుర్తించిన స్థానిక రైతులు ఎత్తిపోతల కమిటీ చైర్మన్ మౌలానాకు సమాచారం అందించారు. ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. సుమారు రూ.10 లక్షల విలువైన ఆయిల్, కాయిల్స్‌ను దుండగులు ఎత్తుకెళ్లారని గుర్తించారు. విషయం తెలిసినా విద్యుత్ అధికారులు అక్కడికి రాకపోవడంపై ఆయకట్టు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.